ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH
Monday, May 11, 2009.



# రైతు గుండెమంట ఆర్పే తీరిదా?

పి.వి. సుబ్బయ్యచౌదరి

రాష్ట్రంలో రైతుల కష్టాలకు అంతులేకుండా పోతోంది. విత్తనాల సరఫరా, ఎరువుల లభ్యత, వ్యవసాయ పరపతి, విద్యుత్తు సరఫరా, మార్కెటింగ్ సౌకర్యాలలేమి రైతులను నానా యాతనలకు గురి చేస్తున్నాయి. ఈ సమస్యలన్నింటినీ పంటి బిగువున భరించి ఫలసాయం అందుకునే వేళ- గిడ్డంగులు ఖాళీ లేవంటూ ప్రభుత్వ యంత్రాంగం చేతులు ఎత్తేస్తోంది. ఇదే అదనుగా మిల్లర్లు చెలరేగిపోతున్నారు. అన్నదాతకు మద్దతు ధర అందకుండా సైంధవ పాత్ర పోషిస్తున్నారు.



## కరెంటు కష్టాలు - పంట నష్టాలు

'రైతు స్థితిమంతుడు కానిదే దేశం సుసంపన్నం కాలేదు' ఎర్రకోటనుంచి భారత ప్రధాని మన్మోహన్ పలికిన గంభీర వచనమది. ఆంధ్రప్రదేశ్‌ను హరితాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి చేస్తాం... రైతు రాజ్యం మాది... వరుణుడు మావైపే ఉన్నాడు... హరిత విప్లవం సాధిస్తాం- అని వివిధ సందర్భాల్లో రాష్ట్రాధిపులు మాటల కోటలు కట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్, రబీ రైతులు 2009లో ఎదుర్కొన్నన్ని సమస్యలు రాష్ట్రం ఏర్పడ్డాక మరే రైతూ చవిచూడలేదు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి, వ్యవసాయ సిబ్బందిలో మేటవేసిన నిర్లక్ష్యం అన్నదాతలను నానా యాతనలకూ గురిచేశాయి. సేద్యం కొనసాగించడానికి ప్రభుత్వంవైపు నుంచి తగిన మద్దతు లభించక రైతులు అనుభవిస్తున్న సమస్యలు ఇన్నీఅన్నీ కావు. సరైన మద్దతు ధర అందక, మార్కెట్ మాయాజాల చట్రంలో చిక్కుకొని రైతన్న విలవిల్లాడుతున్నాడు.

## మద్దతు ధరల మాయాజాలం

అన్నిరకాల వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరలనూ 30నుంచి 50శాతం మేర పెంచామని రైతు జనబాంధవులుగా భుజకీర్తులు తగిలించుకొన్న ఏలికలకు ఉత్పత్తి వ్యయం 300నుంచి 500శాతం పెరిగిన విషయం కనిపించలేదా? ఉదాహరణకు ప్రభుత్వ గణాంకాల ప్రకారం క్వింటాలు వరిధాన్యం ఉత్పత్తి చేయాలంటే రూ.1,200 నుంచి రూ.1,500 ఖర్చు అవుతుంటే- వరి మద్దతు ధరను క్వింటాలుకు రూ.900లుగా నిర్ణయించడంలో ఔచిత్యమేమిటి? పోనీ కనీసం రైతుకు ఆ మాత్రం ధర అయినా నికరంగా దక్కడం లేదే! వ్యవసాయ ఉత్పత్తులన్నింటి విషయంలోనూ ఇదే దుస్థితి.

రైతు పరిస్థితి దిగజారుతున్నా పౌరసరఫరాల శాఖ రాష్ట్రంలో కళ్లు మూసుకుని కూర్చుందని అన్నదాతలు వాపోతున్నారు. మామూళ్ల మత్తులోపడి ధాన్యం సేకరణ, గోదాముల్లో నిల్వల పరిస్థితిని కొందరు అధికారులు పట్టించుకోవడమే లేదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించక రైతన్న నిలువుదోపిడికి గురవుతున్నాడు. కిలో సన్నబియ్యం రూ.35కు పైగా వెచ్చించి కొనాల్సిన వినియోగదారుడి దురవస్థకు సర్కారీ నిర్లక్ష్యమే కారణం. రాష్ట్రంలో ధాన్యం సేకరణను పర్యవేక్షించడం, బహిరంగ విపణిలో బియ్యం ధరలు పెరగకుండా నిరోధించడం పౌరసరఫరాల శాఖ బాధ్యత. ఆ శాఖ ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది. వినియోగదారులకు బియ్యం ధరలూ అందుబాటులోకి వస్తాయి. పంజాబ్‌లో రైతులు ధాన్యాన్ని నేరుగా మార్కెట్లకు తీసుకువచ్చి విక్రయిస్తారు. మనరాష్ట్రంలో పరిస్థితి వేరు. ఇక్కడ నేరుగా మిల్లర్లే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తారు. పౌరసరఫరాలశాఖే మిల్లర్లను నియంత్రిస్తుంది. మిల్లర్లు సేకరించే బియ్యంలో 75శాతాన్ని భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ.)కి లెవీ కింద ఇవ్వాల్సి ఉంది. మిగిలిన 25శాతం బియ్యాన్ని రాష్ట్రంలో ఎక్కడైనా విక్రయించుకోవడానికి ఆ శాఖ అధికారులు అనుమతులు జారీచేస్తారు. రాష్ట్ర అవసరాలనుబట్టి మిల్లర్లనుంచి ఎఫ్.సి.ఐ. ఎంత బియ్యం సేకరించవచ్చునన్న నిర్ణయాన్ని పౌరసరఫరాల శాఖే తీసుకుంటుంది. కోట్లాది జనం జీవితాలతో ముడివడిన వ్యవహారంలో ఆ శాఖ క్షమించరాని నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది.

గోదాముల్లో ఖాళీలేదన్న కారణాన్ని చూపి మిల్లర్లు రబీలో ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయడం లేదు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతు వీధిన పడ్డ తరవాతగానీ ప్రభుత్వ మంత్రాంగం, యంత్రాంగం నిద్ర లేవడం లేదు. తీరుబడిగా నిద్రలేచి గోదాములను ఖాళీ చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాయి. ముందే రంగంలోకి దిగి పౌర సరఫరాల సంస్థ రైతులనుంచి పెద్దయెత్తున ధాన్యం కొనుగోలు చేస్తే వారికి సరైన మద్దతు ధర దక్కేది. కానీ ఆ ప్రయత్నాలేవీ జరగకపోవడమే శోచనీయం. రబీలో కోటీ 24లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రస్తుతం తెలంగాణ జిల్లాలనుంచి ధాన్యం మార్కెట్లోకి వస్తోంది. క్వింటాల్ గ్రేడ్-ఎ రకం ధాన్యాన్ని రూ.930లవద్ద, కామన్ రకం ధాన్యాన్ని రూ.900 చొప్పున మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. మిల్లర్లు గ్రేడ్-ఎ రకం రూ.800, కామన్ రూ.750 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. వేల టన్నుల ధాన్యం మార్కెట్లో నిలిచిపోయి ఉంది. కొద్ది రోజుల్లో కోస్తా రబీ పంట చేతి కొచ్చే అవకాశం ఉంది. అప్పుడూ ఇదే పరిస్థితి ఉంటే రైతన్నకు నిలువు దోపిడి ఖాయం.

వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం నిరుడు కోటీ 33లక్షల టన్నుల బియ్యం ఉత్పత్తి జరిగి ఉండాలి. అందులో సోనా మసూరి వాటా 60 లక్షల టన్నుల పైమాటే. ఇతర రాష్ట్రాలకు, దేశాలకు తరలిపోకుండా చర్యలు తీసుకొని ఉంటే సన్నబియ్యం ధరలు ఈ స్థాయిలో పెరిగేవి కాదు.కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పౌర సరఫరాల శాఖ నిఘా విభాగాన్ని రద్దు చేశారు. బియ్యం ధరలు భగ్గుమన్న తరవాతైనా దాన్ని పునరుద్ధరించి ఉంటే అక్రమ నిల్వల జాడ దొరికేది. బియ్యం నిల్వలు పెద్దయెత్తున ఉన్నాయని, ధరలు పెరగడం లేదని ఆర్థిక శాఖమంత్రి రోశయ్య కొన్ని రోజులక్రితం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్లో సన్న బియ్యం ధర కిలో రూ.35 పలుకుతోంది. ఏలినవారి దృష్టికి ఈ విషయం ఎందుకు వెళ్ళడం లేదు? ప్రభుత్వం ఏర్పాటు చేసిన కౌంటర్లలో సన్నబియ్యం కిలో రూ.20కే దొరుకుతోందని ఆయన చెబుతున్నారు. కానీ వినియోగదారులు ఎందుకు పెద్దగా ఉత్సాహం చూపడం లేదని సర్కారు ఏనాడైనా తర్కించిందా? కౌంటర్లలో కొత్త బియ్యాన్ని ఆవిరిపట్టించి టన్నుల లెక్కన అమ్మిపారేస్తుండటమే సమస్యకు కారణం.

భారత పత్తి సంస్థ(సి.సి.ఐ.)కి చెందిన కొందరు అధికారుల స్వార్థం కారణంగా పత్తికి ప్రకటించిన మద్దతు ధరలు కేవలం దళారులకు మాత్రమే దక్కాయి. అయిదు నుంచి 10 క్వింటాళ్లలోపు చిల్లరగా పత్తి తీసుకువచ్చిన రైతులకు రూ.2880-2940 మించి ధర ఇవ్వకపోగా, గుండుగుత్తగా 80నుంచి 120 క్వింటాళ్ల పత్తి తెచ్చిన రైతులకు మాత్రం మూడువేల రూపాయల మద్దతు ధర కచ్చితంగా చెల్లించారు. వీరంతా సి.సి.ఐ. అధికారులు ప్రైవేటుగా ఏర్పాటు చేసుకున్న దళారులు కావడంవల్లే వారికి పూర్తి మద్దతు ధర ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. చిన్న, సన్నకారు రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళితే తేమ, నాణ్యత, పింజ వంటి సవాలక్ష కారణాలు చూపి మద్దతు ధరకు కోతపెట్టారు. మరోవంక

అధికారులు ఏర్పాటు చేసుకున్న దళారులు బినామీ రైతుల పేరిట తీసుకొచ్చిన పత్తికి మాత్రం పైసా తగ్గకుండా మద్దతు ధర చెల్లించారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్లో సి.సి.ఐ. కేంద్రంలో జనవరిలో కొనుగోళ్లను పరిశీలిస్తే అధికారుల అవినీతి లీలలే వెలుగులోకి వచ్చాయి.

వ్యవసాయానికి రోజుకు ఏడు గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్తు ఇస్తామని నమ్మబలికిన పాలకులు రైతులను నిలువునా వంచించారు. విద్యుత్తు సరఫరాలో నాణ్యత ప్రమాణాలు లోపించడంవల్ల, ఇస్తున్న విద్యుత్తు సరిపోనందువల్ల పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. నిర్వహణ లోపాలు రైతు పాలిట శాపంగా మారాయి. మితిమీరిన కరెంటు కోతలవల్ల ఎండిపోతున్న పంటలను చూసి గుండెమండిన రైతన్న పంటను తగలబెట్టుకొనే దౌర్భాగ్యస్థితి దాపురించింది. మెదక్‌జిల్లా గాజులపల్లిలో నర్సింహారెడ్డి మరణ వాంగ్మూలం గుండెను మెలిపెడుతుంది. ఎండిన పంటను చూస్తే దుక్కమొస్తున్నదనీ, బతుకు బర్బాదైందనీ మరోదారిలేకే చావును చేరుతున్నాననీ ఆయన చెప్పుకొన్నారు. రైతులోకం వెతలన్నింటినీ ఆ వాంగ్మూలం ఏకరువు పెట్టింది. మెదక్ జిల్లాలోని మిర్జాపల్లితండా, ఔరంగాబాద్‌లో ఎండిపోతున్న పంటను చూడలేక అన్నదాతలు పొలాలకు మంటపెట్టుకున్నారు. రంగారెడ్డిజిల్లా మర్పల్లిలో మరో రైతు నీరందక దెబ్బతిన్న అరటిచెట్లను చూడలేక వాటిని అగ్నికి ఆహుతి చేశాడు. ఉచిత విద్యుత్తు పేరిట సర్కారీ మాయమాటలను విశ్వసించడమే ఈ రైతులపాలిట శాపంగా మారింది.

## పట్టాలు తప్పిన యంత్రాంగం

దేశానికి రైతన్నే వెన్నెముక అంటూ మాటలు కోటలు దాటించే నేతలు ఆచరణకు వచ్చేసరికి బాధ్యతలను పూర్తిగా గాలికొదిలేస్తున్నారు. భూసార పరిరక్షణ, విత్తనాల సరఫరా, ఎరువుల లభ్యత, వ్యవసాయ పరపతి అందుబాటు, రుణమాఫీ, విద్యుత్తు సరఫరా, విస్తరణ సేవలు, మార్కెటింగ్ సౌకర్యం, మద్దతు ధర... ఇలా అంశాన్ని పరిశీలించినా ప్రభుత్వ వైఫల్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. అన్నదాతలు సంఘటితమై సమస్యల పరిష్కారంకోసం పాలకులను నిలదీయాల్సిన తరుణమిది. ప్రభుత్వమూ ఆ మేరకు బాధ్యతలను గుర్తించి రైతన్నను గట్టెక్కించేందుకు చిత్తశుద్ధితో, దీర్ఘకాలిక ప్రణాళికతో ముందడుగేయాలి. ఖరీఫ్‌లో వ్యవసాయ పనుల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ముందస్తుగా భూసార పరీక్షలు నిర్వహించి- భూసార అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. పంట ఉత్పాదకతను, నాణ్యత ప్రమాణాలను పెంచేందుకు చర్యలు చేపట్టాలి. పంటలవారీగా అవసరమయ్యే విత్తన అవసరాన్ని మదింపుచేసి నాణ్యమైన విత్తనాలను సహేతుకమైన రాయితీలిచ్చి సకాలంలో సరఫరా చేయాలి. రాష్ట్రంలోని కోటీ 20లక్షల కమతాలకు వ్యవసాయ పరపతి అందుబాటులోకి వచ్చేలా- జాతీయ, గ్రామీణ, సహకార బ్యాంకులను, ఇతర స్వయం సహాయక బృందాలను అప్రమత్తం చేయాలి. విద్యుత్తు సరఫరా ఇబ్బందులనుంచి సేద్యాన్ని కాపాడేందుకు సబ్‌స్టేషన్ స్థాయిలో రైతులతో కమిటీలను ఏర్పాటు చేయాలి. అవసరాన్ని కచ్చితంగా లెక్కకట్టి కమిటీల సూచనలకు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్తు అందజేయాలి. పంట ఉత్పాదక వ్యయాన్ని లెక్కకట్టే సిబ్బందికి తగిన శిక్షణ ఇప్పించి రైతుల ఖర్చులను పారదర్శకంగా మదింపువేయాలి. ఎం.ఎస్.స్వామినాథన్ సిఫార్సుల మేరకు ఉత్పాదక వ్యయానికి 50శాతం తగ్గకుండా రైతులకు గిట్టుబాటు ఉండేలా మద్దతు ధరలను నిర్ణయించాలి. దళారులనుంచి రైతులను రక్షించేందుకు మార్కెట్ యార్డుల్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలి. మార్కెట్ యార్డుల్లో విద్యుత్తు తూకపు యంత్రాలను అమర్చాలి. వ్యవసాయ ఉత్పత్తుల ధరల్లో వ్యత్యాసాలు చోటుచేసుకొన్నప్పుడు ప్రభుత్వమే రైతులకు గిట్టుబాటు ధర చెల్లించి వారు నష్టపోకుండా ఆదుకొనేందుకు ఓ మార్కెట్ నిధిని ఏర్పాటు చేయాలి. రైతులు మార్కెట్ యార్డులకు తెచ్చిన వ్యవసాయ ఉత్పత్తులను నిల్వచేసుకొనేందుకు, వాటిపై పరపతి సౌకర్యం కల్పించేందుకు, దళారుల పెత్తనాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి. పంటల బీమా పరిహారం, ప్రకృతి విపత్తుల బారినపడినవారికి చేయూతనిచ్చి, వారికి పునరావాసం కల్పించేందుకు సత్వర చర్యలు చేపట్టాలి. దూరదృష్టి, చిత్తశుద్ధితో పాలకులు తీసుకొనే ఇలాంటి నిర్ణయాలే రైతుకు సేద్యానికి రక్ష.

**(రచయిత భారత రైతు సంఘాల సమాఖ్య సలహాదారు)**